# పేదలపై
# యూపీఐపై ఛార్జీల భారం



**కారేపల్లి, కెరటం న్యూస్**

యూపీఐ డిజిటల్ లావాదేవీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఛార్జీల విధింపు నిర్ణయంతో పేద ప్రజలపై భారం పడనుందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, సింగరేణి మండల కార్యదర్శి కె. నరేంద్ర అన్నారు. శుక్రవారం కారేపల్లి లో విలేకరులతో మాట్లాడుతూ, యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపులపై కొత్తగా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే నిర్ణయం పేద, మధ్యతరగతి ప్రజలు తో పాటు చిన్న వ్యాపారులపై భారం పడనుందన్నారు. రూ.2 వేలు పైబడిన లావాదేవీలకు 0.4 శాతం పన్ను విధించే విధానం అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నల్లధనాన్ని అరికడుతున్నామని దానికి పెద్ద నోట్ల రద్దు డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించిన ప్రధాని మోడీ నల్లధనాన్ని అరికట్టటంలో విఫలమైనారన్నారు. అధిక శాతం ప్రజలు డిజిటల్ పేమెంట్ల కు అలవాటు చేసిన కేంద్రం ప్రభుత్వం దానిపై బాదుడు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. యూపీఐ లావాదేవీలపై పన్ను విధించే నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోందని నగదు లావాదేవీలు పెరిగి అనార్థలకు దారి తీసే ప్రమాదం ఉందన్నారు. చిన్న దుకాణాలు, టీ కొట్లు, చిరు వ్యాపారాలు పెట్రోల్ బంకులలో సహా రోజువారీ జీవితంలో యూపీఐ చెల్లింపులు విస్తృతంగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో ఎలాంటి అదనపు భారం పడకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. నల్లధనాన్ని వెలికితీసి ప్రతి పేదవాడి ఖాతాలో డబ్బులు జమ చేస్తామని గతంలో చెప్పిన కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్ పెట్టుబడిదారులకు రూ.వేల కోట్లు రాయితీలు, బ్యాంకు బకాయిలు మాఫీ లు చేస్తూ పేదలను అప్పుల ఊబిలోనే ఉంచుతుం దన్నారు. కేంద్రం తీసుకొచ్చిన యూపీఐ చార్జీల వసూళ్ల నిర్ణయాన్ని విరమించుకోకపోతే ప్రజల్ని ఐక్యం చేసి కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన పోరాటం తీవ్రత చేస్తామని వారు హెచ్చరించారు.

# లక్ష విత్తన బంతుల పై
# అవగాహనా కార్యక్రమం



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

'ఒక లక్ష విత్తన బంతులు' కార్యక్రమంలో భాగంగా ఇంపాక్ట్ ఇంటర్నే షనల్ ఆధ్వర్యంలో ఇండియన్ కామన్ ఫార్మర్స్ క్లబ్ నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా తేట్టెలపాడు గ్రామంలో మహిళా సర్పంచ్, స్వయం సహాయక సంఘాల మహిళలకు 500 విత్తన బంతులను అందజేశారు. కార్యక్రమానికి మహిళలు, గ్రామస్థులు మంచి స్పందన తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ కామన్ ఫార్మర్స్ క్లబ్ అధ్యక్షుడు, ఆదర్శ రైతు బొమ్మగాని నరసింహారావును గ్రామ సర్పంచ్, స్వయం సహాయక సంఘాల మహిళలు ఘనంగా సన్మానించారు.

### విద్యార్థులకు వృత్తి మార్గదర్శనం

తేట్టెలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వృత్తి విద్య, భవిష్యత్ అవకాశాలపై మార్గదర్శక కార్యక్రమం నిర్వహించారు. విత్తన బంతుల ప్రాముఖ్యత, వాటి తయారీ, పర్యావరణ పరిరక్షణలో వాటి ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో 300 విత్తన బంతులను తయారు చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పైనంపల్లి పాఠశాలలోనూ కార్యక్రమం పైనంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వృత్తి మార్గదర్శక కార్యక్రమంతో పాటు విత్తన బంతుల తయారీ, వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో 250 విత్తన బంతులను తయారు చేయించారు. ఈ సందర్భంగా 'అమ్మ పేరు మీద మొక్క నాటడం' అనే ప్రత్యేక కార్యక్రమం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థసారథి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో పర్యావరణంపై అవగాహన

బీరోలు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వీరాస్వామి ఆధ్వర్యంలో సుమారు 200 మంది విద్యార్థులకు వృత్తి మార్గదర్శక కార్యక్రమం నిర్వహించారు. అలాగే జల్లేపల్లి ప్రధానమంత్రి ఉన్నత పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులకు వృత్తి మార్గదర్శకంతో పాటు ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల కలిగే పరిస్థితులను ఎదుర్కొనేందుకు మనం ఏ విధంగా సహకరించాలి, పర్యావరణ పరిరక్షణలో విత్తన బంతుల ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు విత్తన బంతుల తయారీ విధానం, వాటిని ఖాళీ ప్రదేశాల్లో వేయడం ద్వారా మొక్కల పెరుగుదలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రామ సర్పంచ్‌లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు మరియు ప్రతి ఒక్కరికీ ఇండియన్ కామన్ ఫార్మర్స్ క్లబ్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

